తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :40 | 19-07-2021 | పుటలు : 4






జాతీయకవి
శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ
జయంతి
(జూలై 14)

మాకొద్దీ తెల్ల దొరతనము
దేవ! మాకొద్దీ తెల్ల దొరతనము

మా ప్రాణాలపై
పొంచి మానాలు హరియించె....
అంటూ నాడు బ్రిటిష్ దొరల గుండెల్లో గుబులు రేపిన తెలుగువారు గర్వించదగ్గ స్వాతంత్రోద్యమ గీత రచయిత గరిమెళ్ళ.

వారికి భక్తి నీరాజనం!!
- నన్నయ వాణి






జులై 23
లోకమాన్య బాలగంగాధర
తిలక్ జయంతి.

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి.

జాతీయోద్యమ నాయకులకు,
వీరులకు ఘన నివాళి! భక్తి నీరాజనం!!
- నన్నయవాణి

## మంచి మాట

ఓ భగవంతుడా! "వ్యక్తి కన్నా దేశం గొప్పది"
అనే ఆలోచనను నాయకులు,
అధికారులు, ప్రజల మనసుల్లో ప్రతిష్ఠించు.
ఈ దేశాన్ని శాంతి,
సంపదలతో వర్ధిల్లే జాతిగా
మార్చేందుకు పట్టుదలతో
కృషి చేసేలా నా ప్రజలను
ఆశీర్వదించు.



–
ఏ.పి.జె.అబ్దుల్
కలాం.

# గోదావరి జిల్లాల అభివృద్ధికి కృషి చేద్దాం

### రిజినల్ క్లస్టర్ యూనివర్సిటీల సమావేశంలో నన్నయ వీసీ




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు


**17.06.21** (మీడియాసెల్) స్థానిక వనరులను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ విద్య, విజ్ఞాన, వ్యవసాయ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉభయగోదావరి జిల్లాలను అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం "రీజినల్ క్లస్టర్ గ్రూప్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హేయర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్" సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, జె.ఎన్.టి.యు కాకినాడ, వై.ఎస్.ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం కు చెందిన వీసీ లు, అధికారులు, ఆచార్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి కన్వీనర్ గా వ్యవహరించిన నన్నయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని విద్య, విజ్ఞానం, వ్యవసాయం, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాభివృద్ధిలో విశ్వవిద్యాలయాల పాత్ర చాలా కీలకంగా ఉండాలని అన్నారు. టెక్నాలజీలో ప్రత్యేకతగా జె.ఎన్.టియు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కు ప్రత్యేకతగా నన్నయ, వ్యవసాయ సంబంధిత ప్రత్యేకతగా వై.ఎస్.ఆర్ యూనివర్సిటీలు గోదావరి జిల్లాల్లో ఉండడం మంచి విషయమని వీటిలోని విద్యను, విజ్ఞానాన్ని, పరిశోధనల సామర్థ్యాలను సమర్ధవంతంగా ఉపయోగించుకుంటూ గోదావరి జిల్లాల అభివృద్ధికి కృషి చేద్దామని చెప్పారు. విశ్వవిద్యాలయాలు తమ విజ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాలను సమాజాభివృద్ధి కోసం ఉపయోగించాలని తెలిపారు. వినూత్న ఆలోచనలతో విశ్వవిద్యాలయాల అభివృద్ధితో పాటు గోదావరి జిల్లాల స్థిరమైన అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్థానికంగా ఉన్న ఇండస్ట్రీస్, ఇన్సిట్యూషన్స్, ఆర్గనైజేషన్స్ సహకారంతో అభివృద్ధికి అడుగులు వేయాలన్నారు. ఓ.ఎన్.జి.సి, గెయిల్, నర్సరీలు వంటివి దీనిలో కీలకంగా సహకరించాలన్నారు. అందరూ సమష్టిగా గోదావరి జిల్లాల అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. జె.ఎన్.టి.యు.కె. వీసీ ఆచార్య రామలింగరాజు, వై.ఎస్.ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకిరామ్ తమతమ యూనివర్సిటీలలోని ప్రత్యేకతలను తెలియజేస్తూ, అభివృద్ధిలో తమ సహాయ సహకారాలను గురించి వివరించారు. తమ విశ్వవిద్యాలయాల పరిధిలో, ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేకతలు మరియు సహకార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మూడు విశ్వవిద్యాలయాల అధికారులు, ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష ఫీజు గడువు 20 వరకు పెంపు

**17.06.21** (మీడియాసెల్) ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల డిగ్రీ 2వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ మరియు 4,6 సెమిస్టర్స్ రెగ్యూలర్ అండ్ బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీని ఈ నెల 20వ తేది వరకూ పొడించామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి గురువారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేసారు. పరీక్ష ఫీజుల చెల్లింపులు 13వ తేదితో ముగిసిన నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం 20వ తేది వరకు పొడిగించామని అన్నారు. ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా 20 తేది లోపు డిగ్రీ 2వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ విద్యార్థులు మరియు 4,6 సెమిస్టర్స్ రెగ్యూలర్ అండ్ బ్యాక్ లాగ్ విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించవచ్చునని తెలిపారు. 24వ తేది నాటికి ఉభయగోదావరి జిల్లాల్లోని కళాశాలలు అప్లికేషన్స్ ను అందజేయాలని తెలియజేసారు.

# సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**14.06.21** (మీడియాసెల్) సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని వాటి బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో "అవేర్నెస్ ఆన్ సైబర్ క్రైం అండ్ సైబర్ సెక్యూరిటీ" అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు దీనికి కన్వీనర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ భద్రతకు మరియు ఆర్థిక పరిస్థితులకు హాని కలిగిస్తుందని అన్నారు. బ్యాంకింగ్ లేదా క్రెడిట్ కార్డ్ సమాచారం వంటి సున్నితమైన సమాచారాన్ని భద్రపరచడానికి ఎక్కువ మంది ఇంటర్నెట్ పై ఆధారపడుతున్నారని, నేరస్థులు ఆ సమాచారాన్ని దొంగిలించడానికి ఎక్కువగా ప్రయత్నిస్తున్నారని అన్నారు. సైబర్ నేరాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు.నేటి సాంకేతిక యుగంలో సమాచార భద్రత అనేది చాలా ముఖ్యంగా మారిందని ప్రజలందరూ వాటిపై అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు. సైబర్ నేరాలు భవిష్యత్ లో మరిన్ని కొత్త రూపాలు పొందుతాయని ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధాన వక్తగా హాజరైన శ్రీవాత్సవ్ యాదవల్లి, సొల్యూషన్స్ కన్సల్టెంట్, క్విక్ హీల్ టెక్నాలజీస్, హైదరాబాద్ మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ మంది నెటిజన్లు ఎదుర్కొంటున్న సైబర్ నేరాలు వాటి ఫలితాలను వివరించారు. కంప్యూటర్ సిస్టమ్స్ మరియు నెట్ వర్క్ సమాచారం బహిర్గతం, వారి హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ లేదా ఎలక్ట్రానిక్ డేటాకు దొంగతనం లేదా నష్టం, అలాగే సేవలను అంతరాయం లేదా తప్పుదారి పట్టించడం నుండి రక్షణ పొందే సైబర్ సెక్యూరిటీ మార్గాలను నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్ డా.పి.వెంకటేశ్వరరావు, కోకన్వీనర్స్ ఎం.శ్రీనివాసరావు, డి.దాసు, మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



## మహా

'మహా' అనే పదం లేదా విశేషణం కేవలం కీర్తి ప్రతిష్టలకు పర్యాయపదం కాదు.మన చరిత్ర పుస్తకాలలో, ప్రచార మాధ్యమాలలో, వేదికలమీద, రాజకీయ సభల్లోనూ 'మహా'పదాన్ని ఎక్కువగా వాడేస్తూ ఉంటారు. మహాత్ముడు, మహాకవి, మహానుభావుడు.... ఇలా అవసరం లేనిదానికి కొన్ని పదాలను వాడేయటం వలన అవి అరిగిపోయి వాటి నిజమైన బరువుని,ఉన్నతిని ఆ పదాలు కోల్పోతూ ఉంటాయి. అటువంటివాటిలో ఈ 'మహా' పదమొకటి.

కొందరు వ్యక్తుల త్యాగాలతో, సేవలతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉజ్వల భవిష్యత్తును అందుకున్న ప్రజానీకం కృతజ్ఞతాభావంతో ప్రదానంచేసే బిరుదు 'మహా' అనే పదం. ఆ పదం విస్మయానందాలను, ప్రశంసలను ప్రేరేపిస్తుంది. విజయాలనుంచి ఉద్భవించిన విశేషణమది. భారతదేశం అంటే ఎక్కడో దూరంగా ఉండే వింత భూమి అనే అభిప్రాయం నుంచి, అంతుచిక్కని మార్మిక భూమి అనే మాట నుంచి, ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన జాతిగా, దేశంగా అద్భుతాలను సాధించి నిరూపించి ఘనతచెందిన దేశంగా నిరూపించబడింది. ఇంత వైభవాన్ని సంతరించుకోవడానికి కారణం... అది మన జాతి గత చరిత్రను మలుపు తిప్పిన మహనీయుల చలవే.

వారు మనకన్నా మరింత ఆసక్తికరమైన వ్యక్తులు.చరిత్ర వారిని మహాపురుషులను చేసింది. మన జ్ఞాపకాలు వారికి మహత్తును కట్టబెట్టాయి. కేవలం మన గతవైభవానికి ప్రతీకలుగా మాత్రమే కారు. తమ కలలను తదుపరి తరాలవారు మరింత రక్తి కట్టించడానికి వీలుగా రంగాన్ని సిద్ధం చేసిన మహానుభావులు. ఆ మహా వ్యక్తులలో నూతన పథ గాములు, యోధులు, విప్లవకారులు, నవీకరణ సాధకులు, స్వాప్నికులు, సాహసులు, సృజనశీలురు ఉన్నారు. వీరు తాము పుట్టిన భారతదేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లి కొత్త పుంతలు తొక్కించిన ఘనులు, సమర్థులు. తమ కాలపు నిశ్చితాభిప్రాయాలను కొత్త భావాలతో, నమ్మకాలతో, ఆత్మవిశ్వాసంతో సవాలుచేసి తమ కలలను నిజం చేసుకున్న ఘనులు. ఏకాభిప్రాయ స్తబ్దతను, అత్యధిక సంఖ్యాకులలో పేరుకుపోయిన నిర్లిప్తతనూ, రంధ్రాన్వేషణ తత్వాన్ని పటాపంచలు చేసిన సాహసులు. వీరిలో కొందరు తమ స్థాయిలో సాహసం చేసి సహజత్వాన్ని ప్రదర్శించి, యధాతథ స్థితిని ప్రశ్నించి మార్పుకోసం నడుం బిగించడం చాలా అవసరమని అంగీకరించినవారు.వ్యవస్థలో మార్పు తీసుకురావటానికి సాహసం చాలా అవసరం. ఈ మహా వ్యక్తులలో స్త్రీలు, పురుషులు ఉన్నారు. వీరంతా కలసి భారతదేశాన్ని నిరంతర విస్మయ సీమగా మలిచారు. వీరిలో చాలామంది గురించి మన ప్రాచీన గ్రంథాలలో చదువుకున్నాం.కథలలో శాశ్వత పాత్రధారులుగా మలుచుకున్న మహోన్నతమైన ఆ మహనీయుల జాబితాలో అనేకమంది ప్రసిద్ధి చెందిన వారు, ప్రసిద్దిలోకి రానివారు ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన వారితోపాటు సారథ్యం వహించిన వారూ ఉన్నారు.ఎదురొడ్డి నిలిచి పోరాడిన వారితోపాటు తమ ఊహల్లోని భారతదేశాన్ని వాస్తవీకరించినవారూ ఉన్నారు. భారతదేశం అంటే మహనీయుల విజయాలతో మూర్తీభవించిన ఒక జాతి కథ. హద్దులను ఛేదించిన చైతన్యపు హేల.

అలుపెరుగని యోధులు, అనుపమాన వాక్చాతుర్యం గలవారు, సర్వోన్నతమైన సైనికులు, దృఢ సంకల్పానికి ప్రతీకలు, నిరంతర ఉద్యమశీలురు, మహిళా ఉద్యమం కర్తలు, నవభారత సమసమాజ నిర్మాతలు, విప్లవోద్యమ నేతలు, వజ్ర సంకల్పం కలిగినవారు, ప్రాణ త్యాగం చేసినవారు,జనంతో నడిచిన వీరులు, దయార్ద్ర సంప్రదాయవాదులు,విజ్ఞాన శాస్త్రవేత్తలు,అపూర్వ సమున్నత శిఖరాలు... బహుముఖ ప్రజ్ఞావంతులైన చిరస్మరణీయులెందరో ఉన్నారు.

మహా నాయకుడు, మహా వీరుడు, మహానుభావుడు,మహోన్నత వ్యక్తి లాంటి పదాలన్నీ అటువంటి వ్యక్తులకు,అటువంటి లక్షణాలున్నవారికి ఆపాదించినప్పుడు ఆ పదానికి ఒక విలువ ఏర్పడుతుంది. ఆ పదంలోని ఔన్నత్యం తరవాతి తరాలకు మార్గదర్శకమవుతుంది.

# ఫ్యాకల్టీ అసోసియేట్ గా డా.సుష్మప్రియకు బాధ్యతలు



ఫ్యాకల్టీ అసోసియేట్ గా ప్రొసిడింగ్ అందిస్తున్న వీసీ

**16.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం సహాయాచార్యులుగా విధులు నిర్వహిస్తున్న డా.వై.సుష్మప్రియను ఫ్యాకల్టీ అసోసియేట్ గా నియమించారు. దీనికి సంబంధించిన ప్రొసిడింగ్స్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అందజేసి వివరాలను తెలియజేశారు. యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ విభాగానికి ఫ్యాకల్టీ అసోసియేట్ గా సుష్మప్రియను నియమించామన్నారు. లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్) మరియు సి.డి.సి సెక్షన్ అధికారులు కేటాయించిన ఇతర పనులకు సంబంధించిన అన్ని కార్యకలాపాలలో సేవలందిస్తారని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎక్కువ అనుబంధ కళాశాలలు ఉన్నాయని, పనిని సులభతరం చేసి నాణ్యమైన సేవలు అందించేందుకు ఫ్యాకల్టీ అసోసియేట్ ను నియమించామని తెలిపారు. సి.డి.సిలో మెరుగైన సేవలు అందించాలని సుష్మప్రియకు వీసీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సిడిసి డీన్ డా.ఎం.కమలకుమారి, అసోసియేట్ డీన్ డా. పి. వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.పడాల రాజశేఖర్, ప్రిన్సిపాల్స్ డా.వి.పెర్సిస్, డా.కె. రమణేశ్వరి మరియు సిడిసి సిబ్బంది, విభాగ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మూల్యాంకనం సమర్థవంతంగా చేయండి

**వీసీ మొక్కా జగన్నాథరావు**




మూల్యంకన కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

**16.06.21 (మీడియాసెల్)** మూల్యాంకనం సమమర్థవంతంగా చేయాలని, సకాలంలో విద్యార్థులకు ఫలితాలను విడుదల చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో గల బిఈడీ, బిపిఈడీ, డిపిఈడీ ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులకు మార్చి నెలలో జరిగిన పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని వీసీ శుక్రవారం పరిశీలించారు. మూల్యాంకనకు వచ్చిన సీనియర్ అధ్యాపకులు అందరికి అనేక సూచనలు తెలియజేసారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతంగా మూల్యాంకనం చేయాలని అన్నారు. కోవిడ్ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటిస్తూ మూల్యకనం చేయాలన్నారు. ఈ సందర్భంగా వీసీ మూల్యాంకన వివరాలను తెలియజేస్తూ బీఈడీ 7325 మంది, బిపిఈడీ 786, డిపిఈడీ 513 మొత్తం 8624 పరీక్ష పత్రాల మూల్యాంకనం జరుగుతున్నాయని తెలియజేశారు. 58 మంది అధ్యాపకులు మూల్యాంకనం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, అధ్యాపకులు డా.ఎం.గోపాలకృష్ణ, ఆర్.సాంబశివరావు, డా.జి.ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి - మార్క్సిజం

### - రావు కృష్ణారావు




మానవ జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసే అంశాల్లో సంస్కృతి ఒకటి. సంస్కృతిని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే దానిని మార్క్సిస్టు దృక్పథం నుండి అర్థం చేసుకోవాలి. సంస్కృతిని మార్క్సిస్టు దృక్పథంలో విశ్లేషించిన రచనలు తెలుగులో గతంలో అందుబాటులో లేవు. ఈ లోపాన్ని పూరిస్తూ 2019లో శ్రీ రావు కృష్ణారావు 'మార్క్సిజం-సాంస్కృతిక సిద్ధాంతాలు' అనే పుస్తకం రచించారు. దానికి కొనసాగింపుగా సంస్కృతిని మార్క్సిస్టు దృక్కోణంలో విశ్లేషిస్తూ ఈ అంశాలను మరింత సరళంగా సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా రాయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకం రాశారు. అంతేకాకుండా సంస్కృతిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వీలుగా సంస్కృతిలోని వివిధ అంశాలను ముఖ్యంగా భారతీయ సంస్కృతి, వినిమయ సంస్కృతి, పెట్టుబడిదారీ సంస్కృతి వంటి వాటిని ఈ పుస్తకంలో వివరించారు.

**పుస్తకం**



సంస్కృతిపట్ల అశాస్త్రీయ భావనలు ప్రబలంగా ఉన్న ఈ రోజుల్లో ఈ పుస్తకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. సంస్కృతిని శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి సామాన్య పాఠకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది.

– డా.నారాయణ నక్కిన




## ప్రతిభా వాణి

## శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి

**(16.6.1905 - 12.9.1965)**



ప్రముఖ పండితుడు, కవి, గేయ, నాటక రచయిత శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు.


వచన రచనకు మేస్త్రీ – మల్లాది రామకృష్ణ శాస్త్రి. ఆయన విశ్వమానవుడు. వసుధైక కుటుంబకం అనే భావన మదినిండా బలీయంగా ఉన్న మహనీయుడు. కృష్ణా జిల్లా, చిట్టిగూడూరు గ్రామంలో ఒక సంపన్న కుటుంబంలో కనకవల్లి, నరసింహశాస్త్రి దంపతులకు జన్మించారు. మచిలీపట్నంలో బి.ఎ.వరకు చదివారు. తరువాత మద్రాసులో సంస్కృతాంధ్రాలలో ఎం.ఎ.పట్టా పుచ్చుకున్నారు. యడవల్లి సుబ్బావధాన్లుగారి దగ్గర వేదవిద్యను, నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారి దగ్గర మహాభాష్యాన్ని, శిష్ట్లా నరసింహశాస్త్రి గారి దగ్గర బ్రహ్మసూత్రాలను అభ్యసించారు. నాట్యకళలో, చిత్రలేఖనంలో, సంగీతంలో కూడా వీరికి ప్రవేశం ఉంది. మొదట మచిలీపట్నంలోనే స్థిర నివాసం. తర్వాత కొంతకాలంపాటు గుంటూరులో కాపురం. 15వ ఏట పురాణం సూరిశాస్త్రి గారి కుమార్తె వెంకటరమణతో వివాహం జరిగింది. కొంతకాలంపాటు గుంటూరులో పాములపాటి వెంకట కృష్ణయ్యచౌదరి నడిపే 'దేశాభిమాని' పత్రికకు ఉపసంపాదకుడిగా పనిచేశారు. చిన్నతనంనుంచే వీరు రాసిన వ్యాసాలు, కథలు పలు పత్రికల్లో అచ్చయ్యాయి. శాస్త్రిగారు రాసిన పలు నాటకాలు, నవలలు వారికి చిరకీర్తిని ఆర్జించిపెట్టాయి. "కృష్ణాతీరం" అచ్చ తెలుగు నుడికారానికి పట్టం కట్టిన రచనగా తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నవలగా ఖ్యాతి గడించింది. తెలుగు సినీ పరిశ్రమలో దిగ్దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం 'పల్నాటియుద్ధం' సినిమా రచనకు సంబంధించి సలహాలకోసం శాస్త్రిగారిని మద్రాసుకు ఆహ్వానించారు. అలా 1945, మార్చి 24న మద్రాసులో అడుగుపెట్టిన రామకృష్ణ శాస్త్రిగారు తర్వాతి కాలంలో తెలుగు చలన చిత్ర సీమకు సరికొత్త భాషాపరమైన సొబగుల్ని మాటలు, పాటల ద్వారా పరిచయం చేసి కొత్త ఒరవడికి నాంది పలికారు. మద్రాసులో చాలాకాలంపాటు సముద్రాల రాఘవాచార్యకూ మల్లాది రామకృష్ణశాస్త్రికీ చక్కటి సాన్నిహిత్యం ఉండేది. రామకృష్ణ శాస్త్రి చాలాకాలంపాటు తెలుగు సినీ పరిశ్రమలో "ఘోస్ట్ రైటర్"గా ఉన్నారు. 1952కు ముందు సినిమాల్లో చాలావాటిల్లో వీరి పేరు ఉండేదికాదని పలువురు సినీ ప్రముఖులు చెబుతారు. చిన్న కోడలు చిత్రంతో శాస్త్రిగారు అజ్ఞాతవాసాన్ని వీడి తెరమీదికొచ్చారు. తన సొంత పేరుతో 39 చిత్రాలలో 200కు పైగా పాటలను రాశారు. మద్రాసులోని పానగల్లుపార్కులో ఓ చెట్టుకింద ఉన్న రాతిబల్లమీద కూర్చుని సాయంత్రం వేళ్లలో విద్వత్సభలను నడిపేవారు. ఈ సభల్లో అనేక శాస్త్రాలకు సంబంధించి, అనేక విషయాలకు సంబంధించి, అనేక రంగాలకు సంబంధించి, భాషకు, భావానికీ, అభివ్యక్తికీ సంబంధించి అనర్గళంగా మాట్లాడేవారు. ఎందరో వర్ధమాన కవులకు, రచయితలకు సందేహాలను నివృత్తి చేసేవారు. అదిమాత్రమే కాక ఆ సమావేశాలకు హాజరైనవారిలో, పానగల్లు పార్కుకు వచ్చి శాస్త్రిగారిని కలిసినవారిలో ఆకలిగొన్నవారికి తన బ్యాగులో ఉన్న హొటల్ భోజనం టిక్కెట్ల కట్టలోంచి ఓ టిక్కట్టును చింపి ఇచ్చి వారి కడుపునింపిన వెన్నలాంటి కన్నతల్లి మనసు ఆయనది. కేవలం ఇలా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టించడంకోసమే ఆయన తన చేతికి డబ్బు రాగానే పాండీ బజార్ లో ఉన్న హొటల్ కి వెళ్లి ప్రత్యేకంగా భోజనం టిక్కెట్ల పుస్తకాన్ని కొనుక్కొచ్చేవారని ఆయన్ని బాగా ఎరిగినవారు చెబుతారు. అందరినీ తనవాళ్లుగా భావించి ఆదరంగా చూసుకునే మంచి మనసు ఆయనది. రామకృష్ణశాస్త్రిగారు దాదాపు వందకి పైగా భాషల్లో పండితులని ప్రతీతి. సినీ రచయిత, కవి ఆరుద్ర మద్రాసులో మల్లాది రామకృష్ణశాస్త్రిగారింటికి తరచూ వెళ్లి అనేక విషయాలు తెలుసుకోవడంలో ఆసక్తిని కనబరిచేవారు. ఓ రోజున ఆరుద్ర నేరుగా "గురువుగారూ మీకసలు ఎన్ని భాషలు తెలుసును?" అని అడిగారు. దానికి సమాధానంగా శాస్త్రిగారు జాబితా రాసుకోమని చెబితే, అప్పుడు ఆరుద్ర "అలా కాదు. మీకెన్ని భాషల్లో కవిత్వం చెప్పగల సాధికారత ఉందో, అన్ని భాషల్లోనూ ఈ విసనకర్ర ఆకులపై ఒక్కో ఆకుమీద ఒక్కో సంతకం చొప్పున ఆయా భాషల్లోనే చేసివ్వండి" అంటూ తాటాకు విసనకర్రను, ఇంకు పాళీ కలాన్ని ఆయన చేతికి ఇచ్చారు. అప్పుడు శాస్త్రిగారు ఒక్కో ఆకుమీద ఒక్కో భాషలో సంతకం చేస్తూపోతే మొత్తంగా ఆ తాటాకు విసనకర్రకు రెండు వైపులా ఉన్న ఆకులన్నీ నిండిపోయాయి. ఇది స్వయంగా రామకృష్ణశాస్త్రిగారి పెద్ద కుమారుడు మల్లాది నరసింహశాస్త్రిగారు చెప్పిన విషయం. కనుక బహుభాషావేత్త అయిన రామకృష్ణశాస్త్రిగారికి వందకు పైగా భాషల్లో కవిత్వం చెప్పగలిగిన పాండిత్యం ఉండేదని నిష్కర్షగా చెప్పొచ్చు.

మల్లాది రామకృష్ణ శాస్త్రి కృష్ణా పత్రికలో ఛందోబద్ధమైన కవిత్వం రాశారు. ఈ పత్రికలోనే చలువ మిరియాలు పేరుతో ఆయన రాసిన వ్యంగ్య వ్యాసాలకు అశేషమైన పాఠకాదరణ లభించింది. తన 19వ ఏటనే కథారచన ప్రారంభించి దాదాపు 125 కథలను రాశారు. వీరు రాసిన దుమువులు కథ 14 భారతీయ భాషలలోకి అనువదింపబడింది.

ఆ మహాకవికి, బహుభాషావేత్తకు నన్నయవాణి అక్షర నీరాజనం!!

# విదేశీ విద్యార్థులకు నన్నయ ఆహ్వానం


### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అడ్మిషన్స్ బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ

**15.06.21 (మీడియాసెల్)** అన్ని వసతులు, వనరులతో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆఫీసును ప్రారంభించారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అడ్మిషన్స్‌కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, నాణ్యమైన విద్యాబోధన, నిష్ణాతులైన అధ్యాపకులు మరియు అన్ని రకాల వసతులు, వనరులతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ విద్యార్థులకు భారతీయ విద్యాబోధన అందించాలని సూచిస్తున్నాయని, విద్యా నిబంధనల ప్రకారం విదేశి విద్యార్థులకు కేటాయించిన ప్రత్యేక సీట్లును భర్తీ చేసేందుకు అధికారులు సిద్ధం కావాలని అన్నారు. నాక్ గుర్తింపు, ఎ.ఐ.సి.టి వంటి వాటిలో విదేశి విద్యార్థుల సంఖ్యకు ప్రత్యేక పాయింట్లు ఉంటాయన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లలోని పీజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కోర్సులతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో 430 అనుబంధ కళాశాలలలో డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు విదేశీ విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. విదేశీ విద్యార్థుల ప్రవేశ ఆహ్వాన నిమిత్తం సంబంధిత మంత్రిత్వ శాఖలతో, రాయబార కార్యాలయాలతో, రాయబార సంస్థలతో, విదేశీ విద్యార్థుల నాయకులతో ఆన్ లైన్ ద్వారా సంప్రతింపులు జరపాలని వీసీ సూచించారు. విశ్వవిద్యాలయ అధికారులు, ఆచార్యులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తమకున్న పరిచయాలను ఉపయోగించుకొని నన్నయ విదేశీ విద్య ప్రవేశ ఆహ్వానాన్ని అన్ని దేశాలకు తెలియజేయాలన్నారు. వెబ్ సైట్, యూట్యూబ్, ఫేస్ బుక్, వాట్సప్, ట్వీటర్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను ఉపయోగించుకొని విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు పాటుపడాలని సూచించారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో, సంస్థలతో విద్య, పరిశోధన, ప్రాజెక్టులు, అవగాహన ఒప్పందాలు వంటివి కుదుర్చుకొని అంతర్జాతీయ స్థాయిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి గుర్తింపును తీసుకువచ్చేందుకు కృషి చేద్దామని అన్నారు. యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయ్ భాస్కర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ కు అడ్వైజరీగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ ఈసీ మెంబర్స్, ప్రిన్సిపాల్స్, డీన్స్ పలు సూచనలను సలహాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయ్ భాస్కర్, ఈసీ మెంబెర్లు ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.వెంకటేశ్వరరావు, డా.కె.నూకరత్నం, డా.కె.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నన్నయను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్దాం



సరిహద్దులు లేని విశ్వజనీనమైన ఆలోచనలతో విశ్వవిద్యాలయాలు ఉండాలి. ఉభయగోదావరి జిల్లాలకు విద్యాకేంద్రంగా రాష్ట్రంలో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయముంది. అన్ని వసతులు, వనరులున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం,విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు, ప్రాజెక్టుల నిర్వహణ, పరిశోధనలు, విజ్ఞానాన్ని పంచుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రభుత్వం కూడా విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని సూచిస్తుంది. దానికి తగినట్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విమాన, రోడ్డు, రైళ్ళు మార్గాలు మరియు సుందరమైన రాజమహేంద్రవర నగర సంస్కృతి మధ్య విశ్వవిద్యాలయంలో ఉండడం విదేశీ విద్యార్థులకు చక్కని అవకాశం. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో, అనుబంధ కళాశాలల్లో నాణ్యమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విదేశీ విద్యార్థులకు కేటాయించిన సూపర్ న్యూమరీ సీట్లు ద్వారా ప్రవేశాలు కల్పిస్తాం. విదేశీ విద్యార్థులకు నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడం ద్వారా విశ్వవిద్యాలయ అభివృద్ధి, రాజమహేంద్రవరం ఖ్యాతి మరింత పెరుగుతుంది.

**– ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఉప కులపతి.**

## విదేశీ విద్యార్థులకు సువర్ణ అవకాశం



అతితక్కువ కాలంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధించింది. ఐ.ఎస్.ఓ సాధించడం, విద్యాపరమైన ప్రగతి, జాతీయ అంతర్జాతీయ సదస్సులు మరియు నూతన ఆవిష్కరణలతో విశ్వవిద్యాలయం ముందుకు వెలుతుంది. విదేశి విద్యార్థులు విశ్వవిద్యాలయంలో చదవడం ద్వారా నాక్ గుర్తింపులో మంచి గ్రేడ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో పక్కా భవనాలు, విశాల మైదానం, విద్యార్థులకు అన్ని రకాల వసతులు, నాణ్యమైన విద్యాబోధన వంటివి విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తాయి. విశ్వవిద్యాలయ సిబ్బంది అందరూ విదేశాలలో తమకు ఉన్న సంబంధాలను ఉపయోగించుకుంటూ నన్నయ విశ్వవిద్యాలయంలో విదేశి విద్యార్థుల ప్రవేశాలకు ప్రయత్నిస్తాం.

**- ఆచార్య కె.శ్రీరమేష్, ఈసీ మెంబెర్**

## వర్సిటీకి నూతన శోభ



విదేశీ విద్యార్థులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుకోవడంతో విశ్వవిద్యాలయంలో నూతన శోభ నెలకొంటుంది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నూతన ఆవిష్కరణకు తెరతీసారు. అంతర్జాతీయ విద్యార్థుల కార్యాలయాన్ని విశ్వవిద్యాలయంలో ప్రారంభించడం హర్షణీయం. విదేశీ విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చక్కని అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నన్నయలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించిన వార్త విస్తృతంగా వ్యాప్తి జరిగింది. దానికి తగినట్టుగా ఆయా దేశాల నుండి మంచి స్పందన వస్తుంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం పట్ల ఆసక్తి గల విద్యార్థులు విదేశాలలో అనేక మంది ఉన్నారు వారికి ఇది చక్కని అవకాశం.

**– ఆచార్య టి.అశోక్ రిజిస్ట్రార్.**

## ఇంటర్నేషనల్ స్టూడెంట్ వింగ్ చారిత్రక ఘట్టం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆఫీసును ప్రారంభిం చండం చారిత్రక ఘట్టం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ డీన్ గా ప్రస్తుత ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు విలువైన సేవలు అందిం చారు. విదేశీ విద్యార్థులకు విశ్వ విద్యాలయంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు పాటుపడ్డారు. అటువంటి ఉపకులపతి మార్గదర్శకంలో విదేశీ విద్యార్థులకు చక్కని, నాణ్యమైన విద్య అందుతుందని భావిస్తున్నాను. విశ్వవిద్యాలయంలో ఉన్న ఆచార్యులు విదేశాలలో ఉన్న సంబంధాలను ఉపయోగించుకుంటూ అనేక దేశాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. సోషల్ మీడియా సాధనాల ద్వారా విదేశీ విద్యా ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్ లను పంపి వారితో సంభాషిస్తున్నాం. వీసీ పర్యవేక్షణలో త్వరలో మంచి ఫలితాలను నూతన కళను విశ్వవిద్యాలయంలో చూడబోతున్నాం.

**- డా.బి.జగన్మోహన్ రెడ్డి, ఈసీ మెంబర్**


## అనువైన ఫీజులు - విలువైన విద్య



విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం వచ్చే విద్యార్థులకు అనువైన ఫీజులు ఉంటాయి. మిగిలిన ప్రాంతాల్లోని ఫీజులతో పొల్చితే తక్కువ ఫీజులతోనే విలువైన విద్యను అందిస్తాం. ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలల్లో డిమాండున్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అర్హత, ఆసక్తి ఉన్న విదేశీ విద్యార్థులు యూనివర్సిటీ వెబ్ సైట్ లో సూచించిన సూచనల ప్రకారం ప్రవేశాలను పొందవచ్చు. అంతర్జాతీయ విద్యార్థుల కార్యాలయ సేవలు విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉంటాయి. వీటిని సద్వినియోగం చేసుకొని విలువైన విద్యను అనువైన ఫీజులతో అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశిస్తున్నాం.

**– డా.ఎన్. ఉదయ భాస్కర్, డీన్,స్టూడెంట్ అఫైర్స్**

# ప్రపంచ జనాభా దినోత్సవం




గత సంచిక తరువాయి...

రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు , జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలుపై ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్యసమితి 1987 జులై 11 నాటికి ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకోవడంతో ఆరోజునే ప్రపంచ జనాభా దినంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. జనాభా పెరిగితే వనరులు తగ్గిపోతాయి. అధిక జనాభాతో పేదరికం సంభవిస్తుంది. ఆహార ధాన్యాల కొరత ఏర్పడి విపరీతమైన ఆకలి కేకలు వినిపిస్తాయి. జనాభా పెరుగుదల ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో తీవ్ర ఆందోళన కలిగించే విషయం. భారతదేశంలో కూడా జనాభా పెరుగుదల అనేది పెను సమస్యగా ఉంది. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం, నిరక్షరాస్యత, అవసరాలు తీరకపోవడం, పేదరికం అసమానత , నిరుద్యోగం. ప్రపంచంలో అధిక జనాభా గల దేశాల్లో భారతదేశం రెండో స్థానంలో వుంది. రాబోయే కొన్ని సంవత్సరాల్లో చైనా జనాభాను భారత్ అధిగమిస్తుందని నివేదికలు తెలుపుతున్నాయి. కాబట్టి ఇప్పటికైనా జనాభా నియంత్రణ మన అందరి కర్తవ్యం

హరిశ్చంద్ర కొండవీటి డిగ్రీ కళాశాల.

## జన సంద్రం

పసిపిల్లల కేరింతల పరుగులతో
యువకుల ఆశయ సాధనాల ఉరకలతో
మగువల మువ్వల ధ్వనుల నురుగలతో
వృద్ధుల జ్ఞాపక కేతనాల పరవళ్ళతో
జన సాగర విజయ దిక్సూచికలతో
జగతి నావను ప్రగతి వైపు నడిపిస్తూ
అనారోగ్య సునామీలనూ దాటుతూ
ప్రకృతికి పునరుజ్జీవం పోస్తూ
విపరీత శక్తులను నెడుతూ
నిత్యం ఉల్లాసంగా ఉత్సాహంగా
ఉరకలేస్తూ అభివృద్ధి పథం వైపు
సాగాలి జనసంద్రం..!
చేరాలి ఆరోగ్య తీరం..!

- డా. పసుపులేటి నాగమల్లిక
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
రామచంద్రపురం.


## జనంలో మనం



జనాలు! జనాలు!
జనాన్ని చూస్తే చిరాకెందుకు? మిత్రమా ?!
తండోపతండాల జనసంద్రాన్ని చూసి సంతోషంతో
నా హృది ఉప్పొంగుతుంది,
మమైక భావంతో నాట్యమాడుతుంది .
కొండగుహల నుంచి లోయల దాకా, లోయల నుంచి పేటల దాకా,పేటల నుండి కోటల దాకా,కోటల నుండి
బండ్ల దాకా,బండ్ల నుంచి
ఓడల దాకా,ఓడల నుండి రోడ్ల వరకూ....
భూగోళమంతా నిండిన
నా తోటి మానవులు...
పొలాల్లో తోటల్లో వీధుల్లో,
గుళ్ళలో,బజార్లలో ,బస్సుల్లో, రైళ్లలో,విమానాల్లో
నాలాంటి మనుష్యులు,
తొలిసారి నిప్పుల మంటల
చుట్టూ గంతులేసిన జనం,
మొట్టమొదటి చక్రాల బండిపై
గిరగిరా తిరుగుతూ ఆనందించిన
బుద్ధిజీవులు.
అనాదిగా అన్నింటా అన్ని రంగాల్లో
అభ్యుదయ సాధనాలుగా
అత్యవసరమైనవి మానవ వనరులే!
జనాలే!
అంబరాన్నంటే సంబరాలు చేసుకున్నా, అలవికాని దుఃఖంలో మునిగినా మనలను ఆత్మీయంగా హత్తుకునేది మనుజులే, మనల్ని అర్థం చేసుకునేది మనుషులే!
దృఢ శరీర, మస్తిష్క హృదయాలు గల
మానవులు సాధించగల
అద్భుతాలెన్నో! సమాజాభివృద్ధికైనా,
భాషాసాహిత్యాల సుస్థిర మనుగడకైనా,
కళల వికాసానికైనా,
దేశ రక్షణకైనా, సంరక్షణకైనా
ఆవశ్యకం మానవశక్తియే జీ
మానవత్వాన్నీ, జీవకారుణ్యాన్నీ
పెంపొందించుకుని,
ప్రకృతివనరులను సంయమనంతో వాడుకుంటూ, అందరికీ అన్నీ అందించుతూ శ్రేయోదాయక ప్రజాస్వామ్యాన్ని అనుసరించితే అందరూ సుఖసంతోషాలతో జీవించలేరా?!
రండి! అందరం సంతోషంగా
ప్రపంచ జనాభా దినోత్సవాన్ని
జరుపుకుందాం ఆనందంగా.

-డా. ఆకొండి వెంకటలక్ష్మి,
పిఠాపురం.

## ప్రపంచ జనాభా దినోత్సవం



కల్పించాలి పెరిగిన జనాభాకు
సదుపాయాలు ఏ దేశానికైనా.
ఏవి తగ్గినా పరిస్థితి
అల్లకల్లోలమౌతుంది
ముఖ్యంగా ఆహారం,ఆవాసం,
ఉద్యోగాలు.
మానవ వనరుల్ని సక్రమంగా
వినియోగిస్తోంది
చైనా అధిక జనాభా కలిగినప్పటికీ.
మానవ వనరుల్ని సక్రమంగా
వినియోగించేందుకు ప్రయత్నిస్తోంది భారత
దేశం కూడా.
వనరులు తగ్గి పోతాయ్ జనాభా పెరిగితే .
ఏర్పడుతుంది నీటి కొరత.
అడుగంటుతున్నాయ్ చమురు నిల్వలు ఇప్పటికే.
అశాంతకి దారి తీస్తుంది.
ఆఫ్రికాలో ఇప్పటికే ఆకలి కేకలు వినిపిస్తున్నాయి.
పెచ్చు పెరుగుతాయి ఆక్రమణలు,అంతర్యుద్ధాలు.
విదేశీ సంస్కృతికి ఆకర్షితులై ఇప్పటికే
యువత ఆసక్తి చూపడం లేదు పిల్లల్ని కనేందుకు.
ఇలాగే భవిష్యత్తు కొనసాగితే
జనాభా పెరుగుదల తగ్గుతుంది.
జనాభా తిరోగమనంలోకి వెళ్తుందని అంచనా.
2020వ సంవత్సరం మహిళల, బాలికల ఆరోగ్యం,
వారి రక్షణ సంవత్సరంగా
ఐక్యరాజ సమితి నిర్ణయించింది.
అపరిమిత జనాభావల్ల వనరులు తగ్గిపోతున్నాయి.
కరోనా మటుమాయమైతే తప్ప
ప్రపంచ గమనం సాగని పరిస్థితి.
జనాభా అభివృద్ధి, ప్రపంచ గమనం, ప్రాజెక్టులూ,
కార్య క్రమాలూ అన్నీ జనాభా పైనేగా ఆధారం.
లక్ష్య సాధన కోసం సమయాన్ని
సద్వినియోగం చేసుకోవాలి.
సంస్కృతీ సంప్రదయాలను పరిరక్షిస్తూ
దేశ ప్రజలను తమ తమ కృత్యాలలో
కృత కృత్యులయ్యేలా చెయ్యాలి.

– నడిపల్లి సుబ్బలక్ష్మి
(విశ్రాంత ఉపాధ్యాయిని,న్యూఢిల్లీ)

## హమారా భారత్ మహాన్



భారత దేశపు గుప్పెడు మట్టి
గంగా నది గుక్కెడు నీళ్లు ,సర్వ మతాల వాంగ్మయం
పవిత్ర గురువులు – సంస్కృతి ఇవి మన భారతపు మహత్తు
కర్మ భూమి మన దేశం
ప్రపంచానికే తలమానికం !
కానీ....పెరిగిన భారత జనాభా
పరిమాణం – పరిణామం...
జనాభా విస్ఫోటనం జరిగినపుడు
సామాజిక ,ఆర్థిక భారం పెరిగింది మరింత –
వనరులు ,ఆహారం కొరత
కోల్పుతున్న ఆవాసం
ఆకలి కేకలు , కూలే పాకలు
పెరిగే నిరుద్యోగం
తగ్గని పేదరికం
నక్సలిజం భీతి
పెరిగే అసమానత
వెరసి అయ్యింది నిమ్న- ఆదాయ వర్గ దేశం
అడవులు నాశనం చేశారు
నగరాల సంఖ్య పెంచారు
మానవ స్థావరం విస్తరింప జేశారు
పర్యావరణం పై కూడ జనాభా ఒత్తిడి
భూగోళం పై అసమతుల్య ప్రకృతి ఒరవడి
కనుమరుగయ్యే జీవ వైవిధ్యం
ఉత్పాదక శక్తుల పంపిణీ వైకల్యం
అంతర సాంస్కృతిక సంఘర్షణలు
వలస దారుల,శరణార్థుల ఘర్షణలు
'కరోనా' లోనూ విపరీత జనాభా వాత
వ్యాధుల తీవ్రత ,ఆక్సిజన్ ల , వాక్సిన్ ల కొరత
తక్షణ కర్తవ్యం.....
సెకనుకు అయిదుగురు చిన్నారుల జననం !
ఈ విస్ఫోటనం ఆపేదెలా ?!
జనాభా అదుపు కై
అవగాహన పెంపు కై
ముప్పైవ పడిలో పెళ్లికి ప్రోత్సాహకం
ప్రభుత్వ చర్యలు ముదావహం
చట్ట బద్ధ,ఆమోద యోగ్య విధానం
స్వచ్ఛంద నియంత్రణ కూడా మంచి వైనం
స్త్రీ విద్య ,ఉద్యోగం కద్దు
ఒకే బిడ్డ హద్దు – లేదా అసలొద్దు
అనాథ పిల్లల పెంపకమే ముద్దు
2021 లో పదహారవ జన గణన –
మిలియన్ల నుండి బిలియన్లకు పెంచిన
ఓ సోదరుడా !
ఇక పెరగనీయకు
ప్రగతి కుంటువడనీయకు
ప్రతి ఒక్కరూ ఆలోచించండి – ఆచరించండి
దేశాభివృద్ధికి మన వంతు
సాయం అవుదాం రండి !.

- వాసా ఉమాజ్యోతి,
హిందీ లెక్చరర్, ఎస్.కే.ఆర్.
మహిళా కళాశాల , రాజమహేంద్రవరం.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in